క్లుప్తంగా

320 మంది రక్తదానం



తుని మమతా ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ రాజు

తుని: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం మమతా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 320 మంది డెక్కన్ కెమికల్స్ ఉద్యోగులు రక్తదానం చేసినట్టు ఆసుపత్రి జనరల్ మేనేజర్ జగపతిరాజు తెలిపారు. రక్తదాన శిబిరాన్ని డెక్కన్ కెమికల్స్ డైరెక్టర్ కేవీఎల్‌పీ రాజు ప్రారంభించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవడానికి అందరూ రక్తదానం చేయాలని ఆయన కోరారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన 50 మంది చిన్నారులకు తలసేమియా వ్యాధి ఉన్నట్టు గుర్తించామని జీఎం.జగపతిరాజు తెలిపారు. వీరందరికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తున్నామన్నారు. డెక్కన్ కెమికల్స్ వైస్ ప్రెసిడెంట్ పీవీఎస్ఎస్ రాజు, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు గుప్తా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

తుని రూరల్: సీఎం జగన్ పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా చక్రరావు అన్నారు. మండలంలోని కొత్త సూరవరంలో సోమవారం వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, ఎంపీటీసీ వంగలపూడి అప్పారావుతో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. వచ్చే ఎన్నికల్లో తుని నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి మధుశేఖర్ ఆధ్వర్యంలో ప్రజలకు డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. నాయకులు కుసనం దొరబాబు, గారా శ్రీనివాసరావు, వేముల శివన్నారాయణ, వంగలపూడి వాసు, వంగలపూడి జమీలు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల నిరాహార దీక్ష

తుని: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తుని బ్రాంచి ఆధ్వర్యంలో సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా తుని బ్రాంచి కార్యదర్శి కె.శరత్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్‌పీఎస్ (నూతన పెన్షన్) విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. కొత్త విధానంతో ఉద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. ఉద్యోగ సంఘాలు అన్ని సంఘటితమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్లను సాధించేందుకు పోరాటాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఉద్యోగ సంఘం నాయకులు ఎం.పరమేశ్వరరావు, ఎస్వీ రామారావు, ఎస్‌కే బాజీ, కేశవరావు, ముత్యాలనాయుడు, గణేష్‌నాయుడు, తాతారావు పాల్గొన్నారు.

భూములకు సమగ్ర సర్వే చేయాలని వినతి

తుని/తుని రూరల్: మండలంలోని ఎస్ఎస్ వెంకటాపురంలో ఎన్నో ఏళ్లగా దళితులు, బీసీలు సాగు చేసుకుంటున్న భూములకు సమగ్ర సర్వే చేసి హక్కులు కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు కె.జనార్దన్ కోరారు. ఈ మేరకు సోమవారం లబ్ధిదారులతో కలసి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్‌కు వినతి పత్రం అందజేశారు. బోలేమెట్ట (ఊరమెట్ట)పై భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుని జీవిస్తున్న కుటుంబాలకు హక్కులు కల్పించాలన్నారు. సమగ్ర సర్వే చేయకుంటే పేదలు తీవ్రంగా నష్టపోతారని వినతి పత్రంలో పేర్కొన్నారు. వాడబోయిన శివ, గుద్దటి అప్పారావు, దారా రాజులు, గుద్దటి సూరమ్మ, దండా సత్యవతి, బర్ల అప్పలరాజు పాల్గొన్నారు.

12న తునిలో సంక్రాంతి సంబరాలు

తుని: తుని పట్టణంలో ఈ నెల 12న నియోజకవర్గస్థాయి సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు సోమవారం తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో రాజా కళాశాల మైదానంలో రంగవల్లికలు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు, యువతలు తమ పేర్లను 83412 23624, 92481 29666 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

72 మంది బైండోవర్

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, కిర్లంపూడి మండలాల్లో సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీ, విక్రయాలు, బెల్ట్ షాపులు నిర్వహించే 72 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, కిర్లంపూడి, శంఖవరం, ప్రత్తిపాడు తహసీల్దార్ల వద్ద హాజరుపరిచామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది వెంకన్నదొర, దొరబాబు, రాజు, వీరభద్రరావు, వెంకటేశ్వరరావు, రాంబాబు, రామకృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



బొద్దవరం హైస్కూల్లో గొబ్బెమ్మలు వేస్తున్న విద్యార్థినులు



ఏలేశ్వరం గురుకుల పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



సింహాద్రిపురం పాఠశాలలో భోగి మంట చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వైభవంగా సంక్రాంతి సంబరాలు



గుమ్మళ్లదొడ్డి జెడ్పీ హైస్కూల్‌లో భోగి మంటలు వేసి సందడి చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు/గోకవరం/కోటనందూరు/కిర్లంపూడి: గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి గొబ్బెలమ్మలకు పూజలు చేశారు. బారులు పంచెకట్టు, గొల్లభామల వస్త్రాధరణతో భోగి మంటలు వేశారు. ఏలేశ్వరం సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో సంక్రాంతి సంబరాలను మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి ప్రారంభించారు. ప్రత్తిపాడు ప్రభుత్వ బాలికల బీసీ వసతి గృహంలో విద్యార్థినులు వసతిగృహ ఆవరణలో రంగవల్లులు తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు కట్టారు. రంగురంగుల ముగ్గులతో గొబ్బెమ్మలను అలంకరించారు. కోటనందూరు మండలం బొద్దవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ వెంకటరమణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిపారు.



ప్రత్తిపాడు బీసీ బాలికల వసతి గృహం ఆవరణలో భోగిమంట వద్ద సందడి

గడపగడపకూ సంక్షేమ ఫలాలు



తాళ్లూరులో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న మంత్రి రాజా

తుని రూరల్: అర్హతే ప్రమాణికంగా గడపగడపకూ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని తాళ్లూరులో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ మండలాధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఎంపీటీసీలు గండి రాజులునాయుడు, షేక్ మహబూబ్ సుభానీ, తమరాన శ్రీనివాసరావు, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- ఏలేశ్వరంలో పర్యటన



ఏలేశ్వరంలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు అన్నారు. ఏలేశ్వరం పట్టణంలో సోమవారం ఆయన పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రతి కుటుంబానికి ఏదో పథకంలో లబ్ధి చేకూరిందన్నారు. సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, సామంతుల సూర్యకుమార్, వాగు బలరామ్, మసిరపు నాగేశ్వరరావు, కాకాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామస్థాయి క్రీడా పోటీలు



ఇందుగపల్లిలో క్రీడాకారులను అభినందిస్తున్న సర్పంచులు

కోటనందూరు: మండల పరిధిలోని గ్రామాల్లో 15 రోజుల పాటు జరిగిన ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలు సోమవారంతో ముగిశాయి. స్త్రీ, పురుష విభాగాల్లో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాడ్మింటన్ పోటీలు నిర్వహించి మండలస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఇందుగపల్లి, బొద్దవరం, పాతకొట్టాం, అల్లిపూడి తదితర గ్రామాల్లో మండలస్థాయి క్రీడాకారులకు సోమవారం ఆయా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్లు, క్యాప్‌లు, టీ షర్ట్‌లు అందజేశారు. ఇందుగపల్లిలో సర్పంచులు సుర్ల రాంబాబు, కుంచే సత్యవతి క్రీడాకారులను అభినందించి మండలస్థాయిలో సైతం రాణించి జిల్లాస్థాయికి ఎంపిక కావాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తోందని జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి అన్నారు. మండలంలోని లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్‌తో కలిసి ఆమె విద్యార్థులకు స్పోర్ట్సు కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల, పంచాయితీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, ఎంపీటీసీ జువ్వల సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు జువ్వల బాబులు, బెంతుకుర్తి అబ్బాయి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆనందమానందమాయె



రాజమహేంద్రవరంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సాయిమణి



రౌతులపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



లంపకలోవలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రౌతులపూడి: ప్రభుత్వం పెంచిన పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదావాణం అన్నారు. మండలవ్యాప్తంగా సోమవారం కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛను సొమ్ములు అందజేశారు. ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, రౌతులపూడి ఉప సర్పంచ్ వాసిరెడ్డి భాస్కరబాబు, గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. లంపకలోవలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జేసీఎస్ కన్వీనర్ రామిశెట్టి చినబాబు, వైస్ ఎంపీపీ బంకు శ్రీను, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోనే చిట్టిబాబు, సొసైటీ అధ్యక్షుడు జి సురేష్ తదితరులు పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 136 మందికి పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు.

రాజమహేంద్రవరం వెళ్లి పింఛన్ అందజేత

ఏలేశ్వరం: పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న వృద్ధురాలు షేక్‌ఖాదర్‌వల్లీ అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి రాజమహేంద్రవరంలోని తన కుమార్తె ఇంటి వద్ద ఉంది. ఆమె పింఛను లబ్ధిదారు కావడంతో వార్డు వలంటీర్ కంచర్ల సాయిమణి రాజమహేంద్రవరం వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



జగ్గంపేటలో విద్యార్థినికి ట్యాబ్ పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని మల్లిసాల, జగ్గంపేట జిల్లా పరిషత్ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు సోమవారం ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో సుందరంగా తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నేత తోట రాంజీ, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్ఏ గఫూర్, పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, తులా రాము, కరుటూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

తుని: స్థానిక సీతారాంపురం చక్కా శ్రీరామ్మూర్తి మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 86 మందికి వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ ట్యాబ్‌లను అందజేశారు. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 10 వార్డులకు చెందిన 400 మందికి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉండి జగనన్న కాలనీ ఇళ్లు నిర్మించుకుంటున్న నలుగురికి రూ.35 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ప్రజలకు మేలు చేస్తోన్న ప్రభుత్వానికి మళ్లీ ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కౌన్సిలర్లు సూరిశెట్టి సుభద్రాదేవి, వాసంశెట్టి శ్రీను, కర్రి సత్య జగదీష్, వారాధి జ్యోతి, తుని పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపూడి బుచ్చిరాజు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ప్రత్తిపాడులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థినులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ పాఠశాలలో విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు ప్రభుత్వం స్టడీ మెటీరియల్ అందజేసిందన్నారు. విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రభుత్వం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి సూచించారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వి.రాబాబు, హెచ్‌ఎం రెడ్డి, సీఆర్పీ రాంజీప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, తాతపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు. చినశంకర్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గ్రామ సర్పంచ్ ఏపూరి రామారావు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఎంపీటీసీ పిల్లా కొండలరావు (చిన్న), ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు సోమవారం హెచ్‌ఎం ప్రమీలారాణి, పీఏసీఎస్ చైర్మన్ సీహెచ్ గుప్త ఆధ్వర్యంలో జగనన్న విద్యా భారతి పుస్తకాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. స్థానిక నాయకులు అడబాల అబ్బులు, పెనుగొండ సత్యానందం, కాకర విష్ణు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



మల్లవరంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులతో వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: మండలంలోని మల్లవరంలో 294 మంది లబ్ధిదారులకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తోందన్నారు. గ్రామస్తులకు పట్టాలు వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పైల కల్యాణ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శీరందాసు రాజు, ఎస్సీసెల్ సభ్యుడు కాపారపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ హతం



మండపంలో హతమైన కొండచిలువ

శంఖవరం: మండలంలోని మండపం గ్రామంలోకి చొరబడిన కొండచిలువను స్థానికులు సోమవారం హతమార్చారు. వివరాల్లోకి వెళితే... కొండప్రాంతాలు దగ్గరగా ఉండడంతో సుమారు 8 అడుగుల కొండ చిలువ గ్రామంలోకి చొరబడింది. దానిని చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొందరు యువకులు దానిని హతమార్చడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామం చుట్టుపక్కల పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో విషసర్పాల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు తెలిపారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడంతో కొండ చిలువలు జనావాసాల్లోకి వస్తున్నాయని కొందరు ఆరోపిస్తున్నారు.

క్లుప్తంగా..

బాబూరావు కుటుంబానికి పరామర్శ

తొండంగి: మండలంలోని కోదాడకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దడాల బాబూరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయన కుటుంబ సభ్యులను సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, పార్టీ నాయకుడు దడాల విజయ్ తదితరులు పరామర్శించారు. బాబూరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒంటిమామిడి ఉపసర్పంచ్ గోసల కిషోర్, పెదపూడి రమణ, నూరి బాబు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్రలు

రౌతులపూడి: ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సూచించారు. మండలంలోని బలరామపురం, రాఘవపట్నం గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహించారు. బలరామపురం సభలో రామకుమార్ మాట్లాడుతూ మహిళలకు భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి ఉజ్వల యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్రలు

గోకవరం: మండలంలోని వెదురుపాక, గుమ్మళ్లదొడ్డి గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్రలు నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచులు ఎస్.రామలక్ష్మి, డి.సింగారమ్మ ఆధ్వర్యంలో ఉజ్వల పథకం గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.

ఘనంగా అయోధ్య రాముని దివ్యపాదుక యాత్ర

గోకవరం: ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని తంటికొండలో సోమవారం అయోధ్య రాముని దివ్యపాదుక యాత్ర నిర్వహించారు. తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి) ఆధ్వర్యంలో సత్సంగం సభ్యులు, భజన బృందాలు, కోలాటం నడుమ జై శ్రీరామ్ నినాదాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, గ్రామ పెద్దలు బద్దిరెడ్డి అప్పన్నదొర, దోసపాటి సుబ్బారావు, బద్దిరెడ్డి సుబ్బారాయుడు, బద్దిరెడ్డి రవి పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

గండేపల్లి: చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జగ్గంపేట సీఐ ఎస్ లక్ష్మణరావు హెచ్చరించారు. గండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కోడి పందేలు, పేకాట వంటి జూదాలకు అనుకూలంగా ఉన్న ప్రదేశాలను స్థానిక ఎస్సై ఎస్.రామకృష్ణతో కలిసి సోమవారం సందర్శించారు. అనంతరం గ్రామ పెద్దలతో ఆయన మాట్లాడారు. సంక్రాంతిని పురస్కరించుకుని యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు వంటి సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు.

రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు

గండేపల్లి: తాళ్లూరులో వేంచేసిన రామలింగేశ్వర స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు పండితులు విశేష పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హార్టికల్చర్ విద్యార్థులకు శిక్షణ



రామకృష్ణాగార్డెన్స్‌లో శిక్షణ పొందుతున్న డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు

గోకవరం: మండలంలోని వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయం సాగిస్తున్న రామకృష్ణా గార్డెన్స్‌లో వెంకటరమణగూడెం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ నుంచి 15 మంది విద్యార్థులు ఐదు నెలల శిక్షణ నిమిత్తం రంపచోడవరం మండలం పందిరిమామిడి ఉద్యానవన కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి ఆధ్వర్యంలో పందిరిమామిడి శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, డాక్టర్ యు.శివకుమార్ విద్యార్థులకు ఉద్యానవన పంటలు సాగు పద్ధతులు, చీడపీడల నివారణకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.